# చెరువొడ్డున

ఈ యేడు చెర్లోకి నీళ్ళు ఐదడుగులే వచ్చినై. ఉన్న భూములు యే విధంగా సాగుకావాలన్న ఆలోచన ప్రతి రైతు మెదట్లో మెసు లుతున్నది. ఈ యేడు పంటలు పండకుంటె ముందుకు కరువు సిద్ధం. లెవీ, ఖుష్ ఖరీదు గల్లాలు పోగా యెవనింట్లో గూడా కారుకు సరిపోయె గింజలు కూడా మిగలవు. యెటుబోయి అందర్ని దేడ్‌నాగిచ్చి పోషించ వలసిన భారం రాంరావు ధొరవారిదే.

"ఉన్న ఐదు యెకరాల పారకంలో రాంరావు ధొరవారి మూడు యెకరాల కెట్లయినా నీళ్ళు బెట్టవల్సిందే అదిమాత్రం తప్పదు" అన్నాడు లతీఫ్ నెత్తి గోక్కుంటూ.

"యేటా పదడుగుల నీళ్ళు వస్తుండబట్టి వారిభూములకు అవి యెక్కడున్నా నీళ్ళుబెట్టితే యెవరి కేమనిపించలేదు. కాని యీ యేడు నీళ్ళు ఐదడుగులే వున్నై" అన్నాడు పెద్ద రైతు వెంకయ్య.

'దొరవారి సగం భూముల సేద్యమయితే తక్కిన పొలాలకు నీళ్ళు దొరుకుతవన్నాడు?, రెండెకరాల యినాంలో పదో పాలు చాకలి రామడు.

"పిల్లి మెళ్లో గంట యెవరు గట్టాలే దొరవారిని సగం భూములే సేద్యం చేసి మన సగం భూములకైనా నీళ్లు చాలేటట్లు చెయ్యమని యెవ రడుగాలే!" అన్నాడు పెద్దమాదిగ ముత్తయ్య.

ఆ సంగతె తేలాలన్నారు చెరువొడ్డున గూర్చున్న రైతులంతా.

'ధాత సంవత్సరం మానెటి కరువులో ఉన్న కొత్త నీళ్ళు దొరవారి పొలాలకే పెట్టి నా వెనుకటినుంచి వారి పొలాలు పారినాక తక్కినవారి

పొలాలు పారటం రివాజు. కరువుకైనా కాలానికైనా ఆదుకుంటున్నాడు ధర్మప్రభువు. ధాతకరువులో తిండిగింజలిచ్చి బ్రతికించిందా మారాజే' అన్నాడు వీరుడి కోటయ్య.

'పోయిన మన పెండ్లాల పుస్తెలు ఇచ్చిన రూపాయికి సేరు బియ్యం మరిపించ లేవన్నాడు' ఒక మూలనున్న ముసలి రైతు.

'ఇంక సాగుచేసే కాలమే రాలేదు. ఇప్పుడేం తొందర' అన్నారు అందరిని సర్దుకపోవటంలో ఆరితేరిన సర్వయ్య వగైరాలు. వీళ్ళిటు రైతులకు, అటు గ్రామాధికార్లకు మంచిగావుంటూ ఏ యెండ కా గొడుగు పట్టటంలో ఘనులు.

ఈ సంగతి చిన్నగా గడిలోకి పాకింది. దొరవారి సేరిదారు వెంకయ్య లతీఫ్ వగైరాలను సంప్రదించటానికి వచ్చాడు. 'ఈ యేడు దొరవారి పొలాల విషయం తాతల నాటినుండి వచ్చే రివాజుకు వ్యతిరిక్తం జరుపదలిచినట్లు తెలుస్తున్నది యేం సంగతి' అన్నాడు.

ఉన్న రివాజు నుల్లంఘిస్తే ఏం చిక్కో? గ్రామ దేవతలకు కోపం వస్తుందేమో దానివల్ల గత్తర, అమ్మతల్లి రావచ్చునన్న అను మానాలు బట్టినై. ఆ యనుమానాలను వృద్ధులు బలపరిచారు. పెండ్లి చేసి న్నాడు దొరవారి మామూలు (కట్నం) ఐదు రూపాయలు పంపించక పోయేసరికి పొల్లోనే ముండమోసిన వెంకయ్య బిడ్డ సంగతులు యింకా యిటువంటివెన్నో విషయాలు ముందరబడ్డయి. కాని రైతులంతా ఏమైనా కానీ ఈ యేడు న్యాయం ప్రకారం తమ పొలాలు పారకంలో చేరాల్సిందే అని నిశ్చయించుకున్నారు. ముఖ్యంగా తమ అందరితో లేవీ ఖుష్ ఖరీదు పదేక గల్లాలు పోయించి తనొక్క గింజగూడా పొయ్యకపోవటం, వచ్చిన లేవీ వగైరా డబ్బును సేల్సు సొసైటీ షేర్సుకింద ముజరా పెట్టించి షేర్లు తన పేర కొనుక్కోవటం, షేర్లకింద పోగా మిగిలిన డబ్బును మింగి నూర్చోవటం, అడిగినా ఇవ్వకపోతే ఈ సంగతులు తెల్పుతూ ఇచ్చిన దరఖాస్తుల కింతవరకూ అతీగతి లేకపోవడం కండ్ల ముందాడినై. తిండి గింజ లెవ్వరి దగ్గరా లేనిది చూచి రూపాయికి నాల్గుసేర్ల ప్రకారం ధాన్య

మమ్మిన ధొరవారి దయ యింకా బాగా హెచ్చరించింది. తమ పొలాలు సేవ్యం కాకపోతే పచ్చి కరువు తాండవ మాడ్తుందన్న భయం రివాజును సేరిదారు మాటలను లక్ష్యపెట్టనివ్వలేదు. వీళ్ళంతా కట్టగట్టి ఒకపైనారు. సరె మంచిది చూచుకుందాంలే అని మీసం మెలేసినారు ధొరవారు.

# 2

ఉపాయాలమీద ఉపాయాలు ఊహించాడు. ఊరుకుంటాడా, లేకుంటె ? ఈ యేడు తానునుకున్న ప్రకారం చెర్వునీళ్ళు పారకపోతే కొన్నివేల రూపాయల నష్టం వస్తుంది. రైతు ముండా కొడుకులు బలిసి పోతారు. ఆలోచించి, ఆలోచించి లతీఫ్‌సా అన్నకొడుకు హసనల్లీ మీదికి దృష్టిపోయింది. హసనల్లీ చిన్నగా అటిటు బడి చదువుకొని మజ్లిస్ సంస్థ తరపున ప్రచారకుడుగా పనిచేస్తున్నాడు.మజ్లిస్ అధ్యక్షుడు ఖాజీ షర్ఫుద్దీన్ సాహెబు. ఈయన పెద్ద జాగీర్దారు కూడా.

హసనల్లీ ఊళ్ళో మాల మాదిగలను మతం మార్పించినాడు. దొరవారి వెట్టి వగైరా బంద్ చేయించి తానే ధొర ఐనాడు. ఇందువల్ల ఎంతో నష్టపడ్డ ధొరవారు రైతులతో కట్టు గట్టించి మతం మార్చుకున్న వాళ్ళతో పని తీసుకోకుండా చేసినాడు. మతం తిండి బెట్టటం మానుకొని ఉన్న కూట్లో మన్నుబడే స్థితి వచ్చింది. హసనల్లీ మాట ఎవరూ వినలేదు. పాపం హసనల్లీకి ఊరువిడిచి వెళ్ళిపోయేదాకా పరిస్థితులు విషమించినై. ఈ మామ్లాలో ఖాజీసా॥కు రాంరావుగార్కి కత్తులు కత్తులు దెగేటంత పనైంది. చివరకు రాజీ ఐంది. ఖాజీసా॥ హసనల్లీని వాపసు పిలిపించుకునేటట్లు, రాంరావుగారు ఖాజీసా॥ జాగిరు రైతులను వెంటేసుకొని బందోబస్తుకై సర్వేచేసిన పైరవీ వదులుకునేటట్టు ఒడంబడికలు చేసుకున్నారు. ఒకళ్ళ రైతుల నొకళ్ళు ఉసికొల్పకుండా ప్రశాంతంగా తమ హుకూమతు సాగించుకునేటట్లూ ఆపత్కాలంలో పరస్పరం సాయం జేసుకునేటట్లు గూడా షర్తులు తెగినై. ఈ విధంగా ఒకానొకనాడు వెనకటికి కొండంత కథ ముగిసింది.కాని యివాళ హసనల్లీ అవసరం పడ్డది పిలిపించుకున్నారు,

ధొరవారు. హసనల్లీ రావడమే ఆలస్యం ఒక దొకడుగా తనవాళ్ళను చీల దీసేడు. ఇదంతా మీ కెందుకు మీ భూములకు నీరొచ్చే యేర్పాటు నేను చేస్తాను. తక్కిన రైతుల సంగతి మనకవసరంలేదు. మనతో మాత్రం దొరవారు విరోధం పెట్టుకోరు. ఎందుకంటే కిందినుంచి మీదిదాకా అంతా మనవాళ్ళే, అధికార్లు. మా మజ్లీస్ సదరు అధ్యక్షుడు సా॥ మంత్రి పేషి మున్షీకి P. A. దగ్గరి చుట్టం. ఖాజీసా॥తో సిఫారసు చేయించితే ధొరకు తగిన శిక్ష అవుతుంది. అన్ని కచేరీలల్లో పలుకుబడి గలమన మజ్లీస్ వకీళ్ళున్నారు. మజ్లీస్‌ద్వారానే మనబ్రతుకు వాళ్ళ బ్రతుకు కూడా. మనం యేలికలం గులాములతో కలుసుకుంటే గులాములమే ఐపోతాం. ముందు శాసన సభకు మీ ధొర మా ఖాజీ సా॥ రైతుల ప్రతినిధులుగా ఎన్నికై పోతారు. ఎన్నిక కాకపోతే ఇంకెట్లనన్నా వాళ్ళు అక్కడికి పోతారు. అప్పుడు మీకోసమని ప్రత్యేకంగా ఖానూన్‌లు తయారు జేయించుతా. ఎక్కడికి పోయినా మనవాళ్ళడిగినంత మందున్నారు, అని తలా తోకా లేని సంగతులు ధొరవారి దగ్గర తిన్న డబ్బు హలాల్ గావటానికి బోధించాడు. కండ్లకు ప్రత్యక్షంగాని డొంకతిరుగుడు సిద్ధాంతాలు ఇవేమి తెలిసినా తెలియకున్నా చడీ చప్పుడు లేకుండా తమ పొలాలకు నీళ్ళు దొరుకుతాయన్న విశ్వాసం వారి నోరు పడేసింది. అనవసరంగా ఊరి పంచాయితీ తమకెందుకు యెవని చెయ్యి వాడు కడుక్కుంటే చాలుననుకున్నారు. హసనలీ గొప్ప దేవుడైపోయాడు అటు ధొరవారికీ ఇటు వీళ్ళకూ. ఎన్నడూ లేనిది బక్రీద్ పండుగకు వెట్టి బక్రాలు (మేకలు) వసూలైనై. ధొరవారనుగ్రహం వల్ల ఎన్నడూ లేనిది ఒకదినం సొంతం ధొర వారింట్లోనే విడిసి విందులు గడిచినై. పీర్లు సవారీలు అపోయిదూలా అని ఆడ వచ్చిన రైతులను,జీతగాళ్ళను తరిమివేశారు.వాళ్ళ స్థానంలో ఖాజీసా॥ బృందం తయారయింది. ఊళ్ళో ముస్లీములు 'ఇదేమన్యాయం మా వూళ్ళో మేమంతా కలిసి పీర్ల పండగ జేసుకుంటాము. వాళ్ళ పండుగలు కూడా మేమంతా కలిసి చేసుకుంటాం' అని యెదిరించినా హసనల్లీ ఖాజీ సా॥ బృందం కుల తప్పు బెడ్తామని దబాయించి నోరు మూయించారు.

# 3

రైతులంతా అనుకున్న ప్రకారం చెరువు తూములు దియ్యటానికి పోతున్నారు. లతీఫ్ వగైరాలను రమ్మన్నారు. హసనలీ చేసిన తెరచాటు రాజీ వున్నది. కనుక ధొరవారికి వెనకటి నుంచి వస్తున్న హక్కులో దఖలియ్యటం మంచిదిగాదు. ఊరు కట్టు తప్పిపోతుంది. ఇవాళ ఒక్కనాటి మాటగాదు. ఈ రివాజును తప్పించిన మనం ఇంకో రివాజును తన్ని పారెయ్యటానికి తయారైతం. భూమి పుట్టినప్పట్నుంచి, రాజ్యం పుట్టి నప్పట్నుంచీ వున్న రివాజులు దేవుడేర్పాటు చేసిన ధర్మాలతో సమానం. అవి యెప్పటోలిగే సాగవలసిందే అని వాదించి హసనల్లీ జెప్పిన పాఠం సరిగ్గా వప్పగించారు. నీళ్ళ రంగు దిప్పటంతో తక్కిన వాళ్ళకు మాత్రం ఆశ్చర్యం కాలేదు. ఏమైనా కాని మేంమాత్రం పోయి నీళ్ళ బెట్టుకుంటాం మమ్ముల తిండికి మాడ్చి చంపే రివాజును మేమెందుకు మన్నించాలె ? ఇది మా చావుబ్రతుకుల సంగతి. ఈ రివాజు ఈనాటితో పూర్తిగా హతం కావలసిందే నన్నారు, తక్కిన రైతులు. ఈ సంగతి గడిలోకి పాకింది. హసనల్లీకి తెలిపారు దొరవారు. పొలిమెరమీద వున్న ఖాజీ సా॥కు కబురు పోయింది. వెళ్ళిన హసనల్లీ లతీఫ్ వగైరాలను కూడ గొట్టి మనం జేసుకున్న రాజీ ప్రకారం మన దోస్తుకు సాయం చెయ్యా ల్నన్నాడు. ఏం సాయమన్నారు విన్నవాండ్లంతా. 'నీళ్ల బెట్టుకునేవాండ్లను రొకాయించాలె, ధొర మనుషులతో పాటు మనం కూడా గుతప లేసుకుని పోవాలె. వాండ్లు నీళ్ళ బెట్టుకోకుండా ఆపితే, ధొరకూ ఆయనతోబాటు మీకూ నీళ్ళ దొరుకుతాయి. పెరుగన్నంబట్టి ప్రమాణంజేసిన ధొర మాటలు నమ్మి ఆయనకు సాయం చెయ్యాలె' అన్నాడు హసనల్లీ. వెంకయ్య వగైరా లంతా వినేటట్లు లేదు. ఈ యేడు భూములు సేవ్యం కాకపోతే పచ్చి కరువొస్తుంది. కిందటేడు రసల్ గిర్దావరు (Food Inspector) దావ్యామా అందరిండ్లలో ధాన్యం ఊడ్పించి తన ఇంట్లో మిగిలించుకున్న ధాన్యం రూపాయికి నాల్గు సేర్లమ్మితే కొనలేక కష్టాలు పడ్డాము వాండ్లు మోరుదోపితనానికి దిగితే కొట్లాటవుతుంది ఏం చెయ్యాలన్నారు లతీఫ్.

'ఒక్కొక్కణ్ణి పట్టి నరకాలే' అన్నాడు హసనలీ ఒక చంకనున్న కురాను, ఒరలో ఉన్న కత్తి ఊగిపోయాయి. ఇంట్లో గూచొని మన తల కాయలు గోయించి తన పొలాలకు నీళ్ళు బెట్టుకుంటాడు ధొర" అన్నాడు గఫూర్. 'అవును' అన్నాడు లతీఫ్.

"అవును మేమందరం బ్రతికివస్తేగదా మా పొలాలకు నీళ్ళేసేది" అన్నారంతా.

హసనలీ గప్పిన మైకం విడిపోతుండేసరికి మధ్యన అందుకు న్నాడు. మనం సిపాయిలం. మనను చూస్తేనే భయపడిపోతారు. కొట్టు కునేటంత పనిగాదని యుద్ధరంగంలో అర్జునునికోసం కృష్ణుడు పడ్డంత కష్ట పడ్డాడు. చివరకు అంతపని గానివ్వనని చంకలో పుస్తకం ముట్టి ప్రమాణం చేశాకగాని నమ్మకం కుదరలేదు.

# 4

పొరుగూరి ఖాజిసా॥ కబురందటమే ఆలస్యం వేంచేశారు. గలా మిలా యించుకున్నారు దోస్తు లిద్దరూ. కచేరీ వ్యవహారాలు వదులుకున్న ప్పటి నుండీ కలిసింది ఈనాడే.

"మీ కాపద వచ్చిందంటే వుండలేకపోయినా" నన్నాడు ఖాజీసా॥.

"లంజకొడుకులకు గట్టి పాఠం చెప్పాలె. ఇవాళ మా దగ్గరి రివాజు పోతే రేపు మీ జాగీర్లో కూడా రివాజులన్నీ బంద్పైపోతై" అన్నారు రాంరావుగారు.

"పోలీసుల సాయమెందుకు పిల్పించలేదు."

ఈ మామ్లాలో పోలీసులకు జోక్యం కల్గించుకొనే వీల్లేదు. ఖానూను లున్నాయి అని గడగడా తన ఖానూన్ (లా) పాండిత్యమంతా గక్షీలు మురాసి లాల యుక్త గుమ్మరించారు రాంరావుగారు.

పదేండ్లనుంచి పైరవీకారీ చేస్తుంటే ఇంతమాత్రమైనా పట్టుబడక పోతే యేమన్నమాట.

'అజీ మారాజ్ డబ్బు బారేస్తే అంతా ఖానూనే' కొండమీది కోతి దిగొస్తుంది. రెండువేల రూపాయలట్టా బారెయ్యండి నేను బోయి రిజర్వు పోలీసునే బట్టుకొస్తా. పోలీసుల్లో పెద్ద అధికారి మా షడ్డకుని బావమరిది దగ్గరి చుట్టం.'

"సిఫారసులు దేవటంలో మీ ప్రజ్ఞ నాకెరికే. కాని యిప్పుడంత అవసరమేం లేదు. మన చేతగాకపోతేగదా పోలీసుదాకా పోవటం" అని సర్దినాడు రాంరావుగారు.

బిర్యానీ తయ్యారయిందన్న వార్త వచ్చింది లోపల్నుంచి. రైతులు తూములు దీస్తున్నరన్న వార్త వచ్చింది బయటినుంచి. హసనలీకి సైగ అయ్యింది. ఖాజీసా॥ బలగం లతీఫ్ వగైరాలతోబాటు తయారైయ్యాడు హసనల్లీ. మూడు జాడీల దేశీ సారా, ఆరు మేకలు అంతకు ముందే హతమైనై. ఖాజీసా॥ దొరవారి కోసం వెలగల విదేశీ సారాలు లోపల యెదురుచూస్తున్నాయి. వాళ్ళటూ, వీళ్ళిటూ ఎవళ్ళ డ్యూటీకి వాళ్ళు పోయారు.

# 5

శత్రుపక్షంలో వున్న లతీఫ్ వగైరాలను చూచారు రైతులు. ఎంగిలి మెతుకుల మహత్యమన్నారు కొందరుండలేక. హసనలీ అన్నాడు తూములు దియ్యవద్దు దగ్గరికి బోతె కొబ్బరికాయలు పగిల్నట్టు తల కాయలు పగుల్తయని గోగ్గూర కాడలు గోసినట్లు తలకాయలు గోస్తానని కత్తి జూయించాడు. ఇన్నాళ్ళటి రైతులు కారుకష్టా లనుభవించీ అనుభవించీ సంప్రదాయాల కుళ్ళు మడుగులో ముక్కులు దిబ్బిళ్ళు పడి ఉక్కిరి బిక్కిరై బాధపడలేక సంకెళ్ళను దెంచుకోడానికి సిద్ధమైనారు. పచ్చి కరువు వస్తుందన్న భయం ఇదివరకు దొర గల్పించిన కటిక

చీకట్లు మరిచిపోలేదు. ఈ రివాజులు హతమైతే మానవులవలె బతుకుతాం లేకుంటే అటైనా చావే ఇటైనా చావే యేదో ఒకటి తేల్చుకుందా మనుకున్న రైతులు ఉత్త కత్తి జూపుల్లకే భయపడే కాలం పోయింది.

'ఖాజీ సా॥ కుక్క మొరుగు తున్నదిరా' అన్నాడెవరో ఒకమూల నుంచి. ఈ కుక్కను చెరువు తూములు గాయటానికి కిరాయకు దెచ్చు కున్నాడురా మన ధొర అన్నా డింకెవరో.

'రెండు తంతేసరి కుయ్యం కుయ్యమని తోక యూడిస్తుంది' ఇంకెవరో అన్నారు.

తూములు దియ్యనే తీశారు. నీళ్ళు రంయిమని కట్టలు దెంచుకొని పారుతున్నాయి. హసనల్లీ వీరావేశముతో కత్తి దిప్పుకుంటూ వెంకయ్యను నరకటాని కురుకుతున్నాడు. రైతుల్లో నుండొకడు కర్ర గురిచూచి కొట్టాడు. హసనలీ మణికట్టుకు బలమైన దెబ్బ తగిలింది. చేతి కత్తి వూడి గపూరుకు తగిలింది. ఎగిరి గంతెయ్యబట్టిగాని లేకుంటే కాళ్ళు రెండూ తెగిపోయ్యేవే. ఉభయ పక్షాలు యుద్ధానికి దిగినై. కొట్టు కోటంలో ఊరి రైతు లతీఫ్ తల బగిలింది. ఇటు నెత్తురు బారుతున్నది. అటు నీళ్ళు బారుతున్నాయి. గఫూరు చేతిలో కర్ర పారేసి లతీఫ్ తల బట్టుకున్నాడు. ఇదే అదునని ఇంకో కర్ర గఫూరు మీదికి లేచింది. ఆగండి, ఆగండి అని అరుస్తున్నాడు గఫూరు; ఆపండి పాడుకొట్లాట' అంటూ వెంకయ్య గఫూరు మీద పడబోయే కర్రకు అడ్డంబెట్టి తప్పించాడు. లతీఫ్ దగ్గరికి పోయిన వెంకయ్య తన నెత్తి రుమాలు దీసి కట్టు గట్టాడు. నెత్తురు దర్శనంతో అందరికీ దిమ్మదిరిగి దిగాలుపడి చూస్తున్నారు. గఫూరుకంట నీరుబెడుతూ 'ఎవరి కోసమని మన లతీఫ్ తల బగిలినట్లు' అన్నాడు. 'మనకు కరువు దెచ్చిపెట్ట జూచిన ధొర కోసం' అన్నాడు వెంకయ్య. అంతా అవునంటే అవునన్నారు. ఇంకా మైకం వదలని ముస్లిం రైతులు ఏమనకుండా నిర్విణ్ణులై చూస్తున్నారు.

గఫూరందుకున్నాడు : 'మొన్నటిదాకా కొట్లాడుకున్న ఖాజీ సా॥ రాంరావు లొకటైనారు. నిన్నటిదాకా కలిసివున్న మనం పగోండ్లమైనాం.'

"ఇదంతా హసనలీగాడి మాయ. మాట్లాడరేంరా గాడ్దులు' అన్నాడు వెంకయ్య. "ఖాజీ సా॥ దొరలిద్దరు ఒకటైనారు. వాళ్ళకు మతం అడ్డు రాలేదు. బతుకు దెరువాలోచించుకుంటే మతం మనలో చీలికలు దేవటాని కని వచ్చింది" అన్నాడు గఫూరు.

మూల్గుతూ లతీఫందుకున్నాడు 'ధొరది, హసనల్లీగానిది, ఖాజీ సా॥ది వీళ్ళందరిదీ ఒకమతం.నాదీ, వెంకయ్యదీ, మన అందరిదీ ఒకమతం. వాళ్ళది దోపిడీ మతం, మనది బతుకుదెరువు మతం.' 'తన్నండి హసనల్లీ గాణ్ణి' తన్నండి అంటే తన్నండి అన్నారు. ఊరి గుతపలన్నీ ఒకటై దొరల బలగం మీదికి లేచినై. ఈ సంగతి మొదటే ఊహించుకున్న హసనల్లీ మొదటి దెబ్బకే దేవేంద్రలోకం బోయినంత పనై, చెట్ల చాటుకు నక్కి పరారైనాడు. ఈ సంగతంతా జూస్తున్న ఎదురు బలం గుతుపలు పారేసి దండాలుబెట్టి బతిమిలాడు కున్నది. రైతులందరి మళ్ళకు నీళ్ళు బారినై. అందరికీ బాగా పంటలు బండినై. ఈ యేడు కరువు వాసనగూడా రాలేదు. అందరికీ బాధ గల్పించిన రివాజు హతమై రూపుమాసింది "చెరువొడ్డున."

(1946)